సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 17 । జూన్ । 2024



హోర్డింగ్‌లు భద్రమేనా?

పెద్దపెద్ద భవనాలపై ఎటుచూసినా హోర్డింగులే కనిపిస్తుంటాయి. అవి ఎంతవరకు భద్రమనేది ప్రశ్నార్థకంగా మారింది. 8లో▸



ఎక్సైజ్ దాడులు

పలు తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లం పానకం ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. 8లో▸



నడి రోడ్డే బస్టాప్!

పద్దెనిమిదేళ్లుగా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. బస్టాప్ ఏర్పాటు కోసం ఎన్ని అర్జీలు ఇచ్చినా స్పందన లేదు. 8లో▸

స్థానికేతర రగడ

విద్యాశాఖలో డిప్యుటేషన్ల లొల్లి

- బదిలీలు, పదోన్నతుల్లో స్థానికులకు అన్యాయం
- నిరుద్యోగులకు ఏళ్లుగా తప్పని నిరీక్షణ
- టీచర్ పోస్టుల భర్తీకి ఎదురుచూపులు
- ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమైన ఉపాధ్యాయులు, నిరుద్యోగులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా విద్యాశాఖలో డిప్యుటేషన్ల రగడ మళ్లీ మొదలైంది. స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా అడ్డదారుల్లో వచ్చిన కొంతమంది ఉపాధ్యాయులు ఏళ్లుగా ఇక్కడే తిష్టవేశారు. పదోన్నతులు, బదిలీల్లోనే కాదు.. ఖాళీ పోస్టుల భర్తీ విషయంలోనూ స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం లేకుండా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించింది. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా జిల్లాలో ఆ అవకాశం కల్పించలేదు. దీంతో ఇటు ఉపాధ్యాయులు, అటు నిరుద్యోగులు స్థానికేతర అంశంపై ఉద్యమ బాటపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ప్రస్తుతం ఆరువేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 4,722 మందికిపైగా ఏళ్ల తరబడి ఒకేచోట పని చేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఇప్పటికే బదిలీ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. కోర్టు కేసు కారణంగా ప్రస్తుతం ఈ ప్రక్రియ కూడా మధ్యలోనే నిలిచిపోయింది.

590 మందికిపైగా..

జిల్లాల విభజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్దుబాటు, కేటాయింపుల కోసం జీఓ నంబర్ 317ను తీసుకొచ్చారు. కేడర్ స్ట్రెంత్, వర్కింగ్ పొజిషన్, వెకెన్సీ పొజిషన్, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ కేటాయింపులు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో ఇవేవీ పట్టించుకోలేదు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, ఇతర జిల్లాల నుంచి అనేక మంది స్థానికేతరులను అడ్డదారుల్లో తీసుకొచ్చి ఇక్కడ నియమించారు. నిజానికి 2014 నాటికే జీఓ నంబర్ 610 ప్రకారం జిల్లాలో 590మంది స్థానికేతరులు ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత స్థానిక జిల్లా కోటా 95 శాతం పెంచినప్పటికీ.. స్థానికేతరుల నుంచి మాత్రం విముక్తి లభించలేదు.

దక్కని అవకాశాలు

ఒకవైపు స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశాన్ని కోల్పోతుంటే.. మరోవైపు బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన 20 వేల మందికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతున్నాయి. జిల్లాలో 200పైగా సెకండ్ గ్రేడ్ టీచర్ పోస్టులను స్థానికేతరులతో నింపారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో 44 పోస్టులు ఖాళీగా ఉండాల్సి ఉండగా మూడు పోస్టులే కన్పిస్తున్నాయి. మిగిలిన పోస్టులన్నీ స్థానికేతరులతోనే నింపేశారు. విచిత్రమేమిటంటే స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్‌ను తీసుకొచ్చి ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ పోస్టులో నియమించారు. హైకోర్టు డబ్ల్యూపీ నంబర్ 28043/2023 తీర్పును అనుసరించి స్థానికేతరులను గుర్తించి, వారిని తిప్పి పంపాలి. అలా చేయకపోవడంతో స్థానికత ఉన్న ఉపాధ్యాయులు పదోన్నతుల్లోనే కాదు బదిలీల్లోనూ తమకున్న అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం లేకపోలేదు.

ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, ఖాళీల వివరాలు

హోదా	పోస్టులు	పని చేస్తున్నవారు	ఖాళీలు
గ్రేడ్–2 హెడ్‌మాస్టర్	220	204	16
స్కూల్ అసిస్టెంట్స్	2,612	2,354	258
ఎస్‌జీటీ	3,693	3,449	244
మొత్తం	6,525	6,007	518

నిరుద్యోగులకు నష్టం

2022 జనవరి 6 నాటికి జిల్లాలో 738 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, ఇప్పటికే 427 పోస్టుల్లో స్థానికేతరులు వచ్చి చేరారు. ప్రస్తుతం 308 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు చూపిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి అడ్డదారుల్లో వచ్చి చేరిన స్థానికేతరులను గుర్తించి వెనక్కి పంపాలి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు అదనంగా మరికొన్ని కలిపి మొత్తం 1000 పోస్టులను భర్తీ చేయాలి. ఎస్సీ, ఎస్టీ, రూల్ ఆఫ్ రిజరేషన్ పాటించని అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలి. విద్యాశాఖాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి. స్థానిక ఉపాధ్యాయులకే పదోన్నతులు వచ్చేలా జాబితాలు సిద్ధం చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, చిత్రంలో నిందితులు

దోచేయాలని చూశారు.. దొరికిపోయారు

దోపిడీ దొంగల ఆటకట్టు

- 15 మంది అరెస్టు, పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ వ్యాపారి ఇంట్లో నల్లధనం ఉందని దొంగిలించడానికి ప్రయత్నించిన దోపిడీ దొంగల బండారం బయట పడింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి లోని బ్రాహ్మణపల్లిలో నివసించే బొగిని జంగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడికి శేఖర్‌రెడ్డి అనే డ్రైవర్, ఎండీ మహమూద్ అనే ఇసుక వ్యాపారి స్నేహితులు. వీరు తరచూ తుర్కయంజాల్‌లోని ఓ టీ స్టాల్‌లో కలుస్తుండేవారు. ఎలాగైనా సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఈ క్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి లోని శ్రీరామ్ నగర్ కాలనీలో నివసించే చాక్లెట్ కంపెనీ యజమాని ఇంట్లో రూ.950 కోట్ల నల్లధనం ఉందని అతని వద్ద పని చేసే పాత వాచ్‌మన్ నుంచి సమాచారం వచ్చినట్లు మహమూద్ చెప్పాడు. కూకట్‌పల్లి నుంచి ఓ పూజారిని తీసుకొచ్చి నిజంగానే అతని వద్ద డబ్బుందా లేదా అని పూజలు చేసి డబ్బు దోచేయాలని చూశారు. ఇదే విషయం బొగిని జంగయ్య తనకు తెలిసిన పెద్ది శ్రీనివాస్‌కు చెప్పగా అతను రజాక్ అనే విజయవాడకు చెందిన వ్యక్తి నంబర్ ఇచ్చాడు. రజాక్ గతంలో చాక్లెట్ కంపెనీలో పని చేసిన మేనేజర్‌ను సంప్రదించగా డబ్బు ఉన్నది నిజమేనని చెప్పాడు. అంతకు ముందు రజాక్ చేతిలో మోసపోయిన సతీష్‌కు ఫోన్ చేసి మళ్లీ డబ్బు సంపాదించే చాన్స్ వచ్చిందని చెప్పాడు. చాక్లెట్ కంపెనీ యజ మాని ఇంటి లొకేషన్ పంపి ఇందులో ఉన్న డబ్బు దోపిడీ చేయడానికి మనుషులను మాట్లాడమని కోరాడు. సతీష్‌కు గతంలో సహకరించిన జాఫీ, లకానీకి విషయం చెప్పాడు. గతంలో వాడినట్లు సతీష్ వద్ద ఉన్న ఫేక్ మనీ తీసుకెళ్లి దొంగతనం చేసిన డబ్బు స్థానంలో ఈ డబ్బు పెట్టి నకిలీ డబ్బు తయారు చేస్తున్నట్లు అందరి దృష్టి మళ్లించడానికి పథకం వేశారు. పాతబస్తీకి చెందిన వ్యక్తులను పిలిచి హార్డ్‌వేర్ షాపులో ఐరన్ కట్టర్, స్పాన్నర్, పైర్‌స్ప్రే, డోర్ తాళం పగలగొట్టడానికి ఇనుప రాడు, కత్తులు కొనుగోలు చేశారు. రెండు కార్లు, ఒక స్కూటర్ మీద ఈ నెల 4న దోపీడికి యత్నించారు. వాచ్‌మన్ ఉండటంతో వెనక్కి వచ్చారు. మళ్లీ రెక్కి నిర్వహించి ఈ నెల 11న ఆవరణలోకి ప్రవేశించారు. బొగిని జంగయ్య, మహమూద్, శేఖర్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్, సతీష్, జాఫీ, లకానీ బయట ఉండగా మిగతా వారు ఇంట్లోకి దూకి సీసీ కెమెరాలు పగలగొట్టారు. వాచ్‌మన్ చూడగా అరిస్తే చంపేస్తానని బెదిరించారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా ..

తలుపులు, తాళాలు పగులగొడుతుండగా యజమాని గమనించి డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు రావడంతో అక్కడి నుంచి ఉడాయించారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజీ ఆధారంగా ఒకరి తర్వాత ఒకరిని మొత్తం 15 మంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రజాక్ పరారీలో ఉన్నాడు. వారి నుంచి మూడు కార్లు, ఒక స్కూటీ, 16 సెల్‌ఫోన్లు, 2 ఐరన్ కట్టర్లు, రెండు స్ప్రేలు, ఇనుప రాడ్లు, ఫేక్‌మని పేపర్ బండిల్స్, 20 లీటర్ల లిక్విడ్, రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణయ్యతో పాటు హెడ్‌కానిస్టేబుల్ గిరిబాబు, పోలీసులు రవీందర్, కృష్ణ, ఉపేందర్, శివచంద్ర, సంతోష్‌ను డీసీపీ అభినందించారు.

కృత్రిమ అవయవాల పంపిణీ భేష్

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అమర్చిన నారాయణ సేవా సంస్థాన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: దివ్యాంగులకు నారాయణ సేవా సంస్థాన్ కృత్రిమ అవయవాలను అందజేయడం ఎంతో అభినందనీయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో 600 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అమర్చారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. నారాయణ సేవా సంస్థాన్ దివ్యాంగులకు ఎన్నో ఏళ్లుగా చేయూతనందిస్తోందన్నారు. కృత్రిమ అవయవాలను పంపిణీ చేసి దైనందిన జీవితంలో వారి పనులు వారే చేసుకునేలా చేయూతనందిస్తోందని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్, బీజేపీ నాయకులు మాధవీలత, గౌరీ శంకర్, కమల్ నారాయణ, ప్రశాంత్ అగర్వాల్, రిదేష్ జాగిర్దార్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఔదార్యం

పరీక్ష కేంద్రానికి బైక్‌పై తీసుకెళ్లి యువతికి సహాయం



యువతిని బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న కానిస్టేబుల్ సురేశ్

రాజేంద్రనగర్: యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఓ యువతిపై కానిస్టేబుల్ ఔదార్యం కనబర్చిన ఘటన రాజేంద్రనగర్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మైలార్‌దేవ్‌పల్లి పల్లె చెరువు మహవీర్ కళాశాలలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు బందోబస్తులో ఉన్నారు. ప్రధాన రహదారి నుంచి కళాశాల కిలో మీటర్‌కు పైగా దూరం ఉంటుంది. అర్ధ కిలో మీటర్ దూరమే పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లేందుకు అనుమతించారు. ఈ క్రమంలో ఓ యువతి ఆటోలో వచ్చింది. పరీక్ష ప్రారంభానికి సమయం నాలుగు నిమిషాలే ఉండటంతో కంగారు పడుతూ పరుగెత్తసాగింది. అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్ గమనించి.. తన ద్విచక్ర వాహనంపై ఆ యువతిని పరీక్ష కేంద్రానికి చేర్చాడు. సదరు యువతి కేంద్రంలోకి అడుగు పెట్టగానే కళాశాల గేట్లను మూసివేశారు. 5 సెకన్లు ఆలస్యమైనా గేట్లు మూసేవారని అక్కడే ఉన్న వారు వెల్లడించారు. తోటి సిబ్బందితో పాటు అధికారులు కానిస్టేబుల్ సురేశ్‌ను అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపడాలి

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్
- చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్నిప్రమాదంపై ఆరా



అగ్నిప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ అజయ్‌కుమార్

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగితేనే మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు వీలవుతుందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించారు. శనివారం రాత్రి డయాలసిస్ కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న నేపథ్యంలో ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను డీసీహెచ్‌ఎస్ రాజు, ఆస్పత్రి సూపరింటిండెంట్ సోమశేఖర్‌కును అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డయాలసిస్ కేంద్రంలోని సమస్యను వెంటనే సరిచేసి సేవలు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆస్పత్రిలో విద్యుత్ టెక్నీషియన్ చెక్ చేసుకోవాలని, నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన ఆస్పత్రిలోని ఇతర వార్డులను పరిశీలించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టులు నిరంతరం అందుబాటులో ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. రాత్రి సమయంలో ప్రైవేటు డాక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు కొంతమంది ఆయన దృష్టికి తీసుకెళ్లగా అలాంటిది జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది పనితీరును మెరుగు పర్చుకోవాలని హితవు పలికారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.



ర్యాంప్‌పై రాజహంసలు!



విద్యార్థుల ఫ్యాషన్ షో అదరహో అనిపించింది. ర్యాంప్‌పై వారు హొయలొలికించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో ఫ్యాషన్ డిజైనర్ రెని ఏర్పాటు చేసిన రెని క్రిస్టల్ ఫ్యాషన్ షోలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సూపర్ మోడల్ కాంపిటీషన్‌లో మూడు టైటిల్స్ గెలుచుకున్న కశ్వి అనే విద్యార్థిని సైతం పాల్గొని ఆకట్టుకుంది. సినీ దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి ర్యాంప్ వాక్‌తో అలరించింది. కార్యక్రమంలో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెన్ విన్ ఓవెత్, కజికిస్తాన్ కాన్సుల్ జనరల్ నాసిర్ అలీఖాన్, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, టర్కీ కాన్సులేట్ జనరల్ ఆర్కాన్ ఆల్మాన్ ఒకాన్ పాల్గొన్నారు.

– బంజారాహిల్స్

న్యూస్‌రీల్

ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మొయినాబాద్: ఆగస్టు 15లోపు ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ప్రమాణం చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని.. జీఓ నంబర్ 1కి విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీని బలోపేతం చేసి ప్రజా సంఘాల నిర్మాణం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీలో ఉండాలన్నారు. అజీజ్‌నగర్‌లో ఏఐటీయూసీ జెండాను కూల్చిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి ప్రభాకర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి



కార్యకర్తలతో చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజక వర్గంలో నైతిక విజయం తనదేనని అన్నారు. కేంద్రంలో బీజేపీని ప్రజలు తిరస్కరించారన్నారు. ఆ పార్టీ 400 సీట్లు వస్తాయని ప్రచారం చేసుకుందని కానీ ప్రజలు మాత్రం 200పై చిలుకు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీని విశ్వసించినందునే ఇండియా కూటమికి అధిక సీట్లు ఇచ్చారని పేర్కొన్నారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఏటీడీవో వెంకటయ్య, వసతిగృహ సంక్షేమ అధికారులు రాములు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

మరోకరి పరిస్థితి విషమం

- మరో ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని మాడ్గులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మూడు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం నాయక్, స్థానికుల కథనం ప్రకారం.. వెల్దండ మండలం అజిలాపురానికి గ్రామానికి చెందిన సల్వాజ్‌యాదయ్య(45), రాఘాయిపల్లికి చెందిన రాయికంటి యాదగిరి ఇద్దరు బావ బామరుదులు. వీరు బైక్‌పై అజిలాపురం నుంచి ఆమనగల్లు వైపు వస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆమనగల్లుకు చెందిన లండం శివ బైక్‌పై సడన్‌గా రోడ్డుపైకి రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఇదే సమయంలో ఎర్రబీక్యతండాకు బైక్‌పై వెళ్తున్న ఇస్లావత్ రోజ బైక్‌లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సల్వాజీ యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రాయికంటి యాదగిరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గాయపడిన శివ, రోజలను ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. యాదయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం నాయక్ పేర్కొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

శంషాబాద్ రూరల్ : మండలంలోని మదన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని చెరువులు, కుంటల కబ్జాను అరి కట్టి, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. సర్వే నెంబరు 37లో 47 ఎకరాల విస్తీర్ణం ఉన్న నల్లచెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు కబ్జా చేస్తున్నాయని వారు ఆరోపించారు. అదే విధంగా సర్వే నెంబర్ 8లో గర్వోనికుంటను కూడా కబ్జా చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, రియల్టర్లు కలిసి అధికారులతో కుమ్మక్కై జల వనరులను ధ్వంసం చేశారన్నారు. చెరువులు, కుంటలను ఆనుకుని భారీగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టారన్నారు. కబ్జాలు చేయడమే కాకుండా నీటి వరదకు అడ్డు కట్ట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలను అడ్డుకునేందుకు కబ్జాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా కబ్జాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్, నర్సింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

సోషలిస్ట్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు పురుషోత్తం



బడంగ్‌పేట్: పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సోషలిస్ట్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకులు బోద్రమోని పురుషోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కట్నాపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్న తల్లిదండ్రులు అక్కడే ఉన్న రేకుల షెడ్డులో ఉంటున్నారు. వర్షం వచ్చి కరెంట్ నిలిచిపోవడంతో బయట ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రించగా ఆరేళ్ల చిన్నారిని బీహార్‌కు చెందిన ఉన్మాది వినోద్ మాజీ(28) అపహరించి అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడని మండిపడ్డారు. ఉన్మాదులను వదిలిపెట్టకుండా వెంటనే అరెస్ట్ చేసి ఉరితీయాలన్నారు. బాధిత చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం రూ.50 లక్షలు ఆర్థిక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ర్యూన్సీ, సహాయ కార్యదర్శి భానుప్రసాద్, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సుజాత, విజయ, నాగేంద్రమ్మ, సంధ్యారాణి, జి.కృష్ణ, లక్ష్మణ, నారాయణ, శేఖర్, గోవింద్ నాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌లు భద్రమేనా?



పట్నంలో ఓ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్



విద్యుత్ పోల్స్‌పై పడిన ఫ్లెక్సీలు (ఫైల్)

- ఈదురుగాలులకు తట్టుకుంటాయా!
- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఎటువైపు చేసినా ఇబ్రహీంపట్నంలోని పెద్దపెద్ద భవనాలపై హోర్డింగులు కనిపిస్తుంటాయి. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిలబడితే నలువైపుల హోర్డింగ్‌లే దర్శనమిస్తాయి. ప్రకటన పోస్టర్లు, విద్యుత్ వెలుగుల్లో అందంగా కనిపించే హోర్డింగ్‌లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయన్న సంగతిని గుర్తుంచుకోవాలని పలువురు హెచ్చరిస్తున్నారు. అడ్డగోలుగా పెడుతున్న హోర్డింగ్‌లకు ఇచ్చే అనుమతులపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలి. గత కొన్నేళ్లుగా ఎండకు ఎండి వానకు తడస్తూ తుప్పుపట్టిన ఇనుపరాడులతో నిర్మించిన హోర్డింగ్‌లు కూలే ప్రమాదం పొంచి ఉంది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలి. అద్దెకు ఆశపడి భవనాల యాజమానులు, హోర్డింగ్‌ల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని అధికారులు దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం డాగ్‌బంగ్లా వద్ద ఓ భవనంపై ఉన్న హోర్డింగ్ వంగిపోయి కూలినప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల ముంబాయిలో హోర్డింగ్ కూలి 14 మంది దుర్మరణం చెందిన ఘటన అందరికి తెలిసిందే.. ఇలాంటి ప్రమాదం జరగకముందే నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

కరెంట్ సరఫరాకు అంతరాయం

ఈదురుగాలులకు హోర్డింగుల కారణంగా విద్యుత్ సరఫరాకు ఇబ్రహీంపట్నంలో తీవ్ర అంతరాయం కలుగుతుంది. హోర్డింగులకు అమర్చిన ఫ్లెక్సీలు ఈదురుగాలులకు ఊడిపోయి విద్యుత్ తీగలపై, ట్రాన్స్‌ఫార్మర్లపై పడటంతో ఒక్కసారిగా కరెంట్ ఆగిపోతోంది. విద్యుత్ అధికారులు ఆ సమస్యను వెతుకొని సరిచేసే వరకు గంటల తరబడి సమయం పడుతుంది. వర్షాకాలం ప్రారంభంలోనే ఈదురుగాలులకు పలుసార్లు ఫ్లెక్సీలు ఊడిపోవడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు నెలకొరిగిన సంఘటనలు ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకున్నాయి. ఏదిఏమైనా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు భద్రమేనా అనే సందేహం కలుగుతుంది. హోర్డింగ్‌ల భద్రతపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు



ఆదాయం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు... హోర్డింగ్‌లపై భవన యాజమానులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలి. ప్రమాదం పొంచి ఉన్న హోర్డింగ్‌లపై అధికారులు, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు.

– ఆనంద్, ఇబ్రహీంపట్నం

విద్యుత్ సమస్యలు



హోర్డింగ్‌లకు కట్టిన ఫ్లెక్సీలు ఈదురుగాలులకు ఊడి తీగలపై, పోల్స్‌పై పడుతుండటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. లైన్లు తెగిపోయి బ్రేక్‌డౌన్ అవుతుంది. విద్యుత్ పునరుద్ధరణకు గంటల తరబడి శ్రమించాల్సివస్తుంది. హోర్డింగ్‌లకు పెట్టే ఫ్లెక్సీలు ఊడిపోకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ కమిషనర్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాం.

– శ్రీనివాస్‌రావు, విద్యుత్ ఏఈ, ఇబ్రహీంపట్నం

దృష్టి సారిస్తాం



హోర్డింగ్‌లపై దృష్టి సారిస్తాం...హోర్డింగ్‌లు పెట్టే నిర్వాహకులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకుంటే పర్మిషన్లు ఇస్తున్నాం. హోర్డింగ్‌ల ఇనుపరాడ్‌ల నాణ్యతను పరిశీలించి వాటి భద్రతకు చర్యలు చేపట్టుతున్నాం.. అనుమతులు లేనివాటిపై చర్యలు తీసుకుంటాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన సుదామా



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుదామా

హుడాకాంప్లెక్స్: పార్టీ తొలినాళ్ల నుంచి నిస్వార్థంగా తెలంగాణ ఉద్యమంలో నడిచిన ఉద్యమ నాయకులను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కలిశారు. ఆదివారం తన వ్యవసాయ క్షేత్రంలోకి ఆహ్వానించి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోలె సుదామా తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా ముందుకెళ్లాలని కేసీఆర్ సూచించారని చెప్పారు. అనంతరం సుదామా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీను

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మిర్యాల శ్రీను (35), శనివారం ఉదయం తల్లి బాలమణి ఆపరేషన్ నిమిత్తం ముచ్చింత్ వెళ్లాడు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో బైక్‌పై సొంత గ్రామానికి వస్తుండగా, మార్గమధ్యలో తుమ్మలకుంట తండా సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీనును వెల్దండ ఎన్నం ఆస్పత్రికి తరలించారు. శ్రీను తమ్ముడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహిళలపై ఏపీఎం వేధింపులు!

- సోషల్ మీడియాలో చక్కర్లు
- చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల డిమాండ్

కొందుర్గు: మహిళల అభ్యున్నతికి విధులు నిర్వహిస్తున్న ఓ ఏపీఎం మహిళలను వేధింపులకు గురిచేస్తున్న ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో వెలుగులోకి వచ్చింది. మండల మహిళా సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం రామస్వామి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, మహిళా వీఓఏలను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలువురికి చాటింగ్ చేసి బెదిరించినట్లు టెక్స్ మేసేజ్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయం బయటికి వెల్లడించడానికి బాధితులు సుముఖత చూపడం లేదు.

కఠినంగా శిక్షించాలి

మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఏపీఎం రామస్వామిని కఠినంగా శిక్షించాలని తుమ్మలపల్లి ఎంపీటీసీ రజిత, బీజేపీ నాయకులు సుధాకర్ రావు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. తక్షణమే అతడిని విధుల్లోనుంచి సస్పెండ్ చేసి, పూర్తి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఏపీఎం వివరణ..

ఈ విషయమై ఏపీఎం రామస్వామిని వివరణ కోరగా రెండు రోజుల క్రితం తన ఫోన్ హ్యాక్ చేశారని, తాను ఎలాంటి పొరపాటు చేయలేదని వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాడ్గుల: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇర్విన్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ వగ్గు అనంద్, ఓనర్ పగడల రవిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడులు

బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

కడ్తాల్: గుడుంబా రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కడ్తాల్, మాడ్గుల మండలాల పరిధిలోని పల్లెచెలకతండా, ముద్విన్, ఎక్వాయిపల్లి, నాగిళ్ల, నల్లచెలక తండాల్లో ముమ్మరంగా దాడులు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. పల్లెచెలక తండా సమీపంలో 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, గుట్టల ప్రాంతంలో మరో 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. నల్లచెలక తండాలో రెండు లీటర్ల సారాను సీజ్ చేసి తండాకు చెందిన లస్కర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన నాటుసారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు స్వప్న, శంకర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ సురేశ్ తదితరులు ఉన్నారు.

విద్యానోడల్ అధికారిగా పర్వతాలు



నియామకపత్రం అందజేస్తున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండల నోడల్ విద్యా అధికారిగా ఇర్విన్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పర్వతాలు నియమితులయ్యారు. ఈ మేరకు మండల ఎంపీపీ పద్మారెడ్డి, ఏఈఓ సర్దార్ నాయక్‌లు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు మధ్యాహ్న భోజనం అందించడానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పర్వతాలు కోరారు.

మనవరాలికి కొన్న బంగారం చోరీ

- వృద్ధురాలిని వెంబడించి కొట్టేసిన గుర్తు తెలియని మహిళలు
- కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు



అనుమానిత గుర్తు తెలియని మహిళలు

షాద్‌నగర్‌రూరల్: తన మనవరాలికి పెడదామని ఓ వృద్ధురాలు బంగారం కొనుగోలు చేసింది.. ఆమెను అనుసరించిన దొంగలు ఆమె వద్ద బంగారాన్ని కొట్టేశారు.. ఈ ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి...మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలం, సూరారం గ్రామానికి చెందిన భారతమ్మ(వృద్ధురాలు) తన మనవరాలి శుభకార్యంలో బంగారం పెట్టాలనుకుంది. పట్టణంలోని ఓ జ్యువెలరీ షాపులో బంగారం కొనుగోలు చేసి బ్యాగులో పెట్టుకుంది. తరువాత సమీపంలో ఉన్న లేడీస్ కార్నర్‌కు వెళ్లింది. బంగారాన్ని కొని బ్యాగులో పెట్టుకున్న విషయాన్ని గమనించిన ఇద్దరు గుర్తు తెలియని మహిళలు భారతమ్మను అనుసరించి లేడీస్ కార్నర్‌లోకి వెళ్లారు. చాకచక్యంగా బ్యాగులో ఉన్న బంగారాన్ని దొంగిలించారు. కొంతసేపటి తరువాత చూసుకున్న భారతమ్మకు బ్యాగులో పెట్టుకున్న బంగారం కనిపించలేదు. దీంతో ఆయా షాపుల్లోని సీసీ కెమెరాల్లో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు భారతమ్మను అనుసరించి బంగారం దొంగిలించినట్లు కొన్ని దృశ్యాలు రికార్డు అయ్యాయి. మనమరాలికి పెడదామని తీసుకున్న బంగారాన్ని దొంగిలించడంతో భారతమ్మ కన్నీరు మున్నీరయింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చేతబడి చేస్తుందనే నెపంతో చెట్టుకు కట్టేసి కొట్టారు

- ప్రశ్నించిన మరో మహిళపైనా దాడి
- తొమ్మిది మందిపై కేసు నమోదు

కొందుర్గు: చేతబడి చేస్తున్నారనే నెపంతో మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడంతో పాటు వివస్త్రను చేసి గ్రామంలో ఊరేగించిన అమానవీయ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు (60) శనివారం ఇంట్లో దేవుడికి పూజలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన మెరుగు బాలమణి, పల్లె భారతమ్మ, పల్లె సుగుణమ్మ, పల్లె అంజమ్మ, పల్లె సురేష్, పల్లె అనుసూజ, దీమా నాగమ్మ, దీమా చెంద్రమ్మ, దీమా లక్ష్మమ్మ కలిసి దాడి చేశారు. అదే సమయంలో గ్రామానికి చెందిన మరో మహిళ అక్కడికి చేరుకొని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా ఆమెపై కూడా దాడికి దిగారు. అనంతరం వృద్ధురాలిని వివస్త్రను చేసి గ్రామంలో ఊరేగించారు. తర్వాత ఇద్దరినీ గ్రామంలోని మైసమ్మ దేవాలయం వద్దకు తీసుకెళ్లి అక్కడున్న వేపచెట్టుకు, స్తంభానికి కట్టేసి కట్టెలు, చెప్పులతో కొట్టారు. వృద్ధురాలి వద్ద ఉన్న రూ.6 వేల నగదు, మెడలో ఉన్న బంగారు గొలుసు, మరో మహిళకు చెందిన కాలు పట్టీలు లాక్కున్నారు. ఈ విషయమై ఆదివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సక్రమ్ తెలిపారు.

నడి రోడ్డే బస్టాప్!

- షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు
- రద్దీతో నగం రోడ్డు వరకు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి
- ప్రయాణికులు, వాహనాలతో ట్రాఫిక్ తిప్పలు



శంషాబాద్‌లో జాతీయ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు

శంషాబాద్ : పద్దెనిమిదేండ్లుగా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. పట్టణంలో బస్టాప్ ఏర్పాటు కోసం స్థానికులు ఎన్ని అర్జీలు ఇచ్చినా స్పందన అంతంతే. పాలకులు మారుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. పట్టణంలోని జాతీయ రహదారిపై షాద్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపు వెళ్లే బస్సులతో పాటు అదే రూట్లో వెళ్లే లోకల్ బస్సులకు ఈ నడిరోడ్డే బస్టాప్‌గా కొనసాగుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో వందలాది మంది ప్రయాణికులు పెరిగి రోడ్డు మధ్య వరకు నిల్చుంటున్నారు. మరో వైపు ప్రయాణికుల కోసం ఆపే బస్సులు, ఇతర వాహనాలతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్‌హెచ్‌ఏ అనుమతి లేకపోవడంతో..

ఇటీవల ఓ సంస్థ పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో షెల్టర్ల ఏర్పాటుకు మున్సిపాలిటీకి డిపాజిట్ చెల్లించి అనుమతి తీసుకుంది. ప్రధానంగా బస్సుల కోసం వేచి ఉండే ఈ ప్రాంతంలో షెల్టర్ల ఏర్పాటుకు ప్రయత్నం జరిగినప్పటికీ ఎన్‌హెచ్‌ఏ నుంచి అనుమతి లేకపోవడంతో వాటిని నిలిపివేశారు. షెల్టర్ ఉంటే ప్రయాణికులకు కొంతైనా ఉపశమనంగా ఉండేది. ప్రస్తుతం ఎండా, వానలకు ఇక్కడే వందల సంఖ్యలో ప్రయాణికులు రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేస్తే..

షాద్‌నగర్ రూట్లో అన్ని లోకల్ బస్సులు పట్టణంలో బస్టాండ్‌లోకి వెళ్లి వస్తే కొంత వరకు ఇక్కడ రద్దీని నియంత్రించే అవకాశాలున్నాయి. అన్నపూర్ణ చౌరస్తా నుంచి మలుపు తీసుకుని తిరిగి బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న దారి గుండా రావాల్సి ఉంటుంది. ఇది డ్రైవర్లకు ప్రయాస కావడంతో దానికి ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రావడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగకుండా పట్టణ శివారులో ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుంది. ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో పాటు ఇటీవల రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లారు. సమస్యను స్వయంగా చూశానని, పరిష్కారం చేద్దామని స్థానిక నేతలతో మంత్రి అన్నట్లు తెలిసింది.

టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం నడి రోడ్డుపై వేచి ఉంటున్నారు. ఇంత వరకు దానిని పరిష్కరించేందుకు ఏ ఒక్కరూ శ్రద్ధ చూపడం లేదు. కనీసం నీడ కూడా లేని చోట వందల మంది బస్సుల కోసం ఆగచాట్లు పడుతున్నారు. పాత బస్టాండ్‌ను ఆధునీకరించడంతో పాటు కొత్తగా అందరికి అనువైన చోట మరో బస్సు టెర్మినల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– వి. జనార్దన్, విశ్రాంత సైనికుడు